ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024




హైకోర్టుకు ఐదుగురు అదనపు న్యాయమూర్తులు

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టుకు ఐదుగురు అదనపు న్యాయమూర్తులను కేటాయిస్తూ కేంద్రప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ సీఎం పూనచ్చ, జస్టిస్ అనిల్ భీమసేనకట్టి, జస్టిస్ సీఎం జోషి, జస్టిస్ ఉమేశ్ ఎం అడిగ, జస్టిస్ టీజీ శివశంకరగౌడలను న్యాయమూర్తులుగా నియమించారు. ప్రస్తుతం హైకోర్టులో చీఫ్ జస్టిస్‌తో కలిపి 51మంది న్యాయమూర్తులు ఉన్నారు. వారిలో 44మంది రెగ్యులర్, ఏడుగురు అదనపు న్యాయమూర్తులు ఉన్నారు.



కాలేజీ..!

- డిగ్రీ విద్యపై... గందరగోళం
- ప్రారంభం కాని అడ్మిషన్లు
- ఎన్నికల కోడ్ కారణంగా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ అమలులోకి వచ్చేనా?
- నాడు ఎన్ఈపీని ప్రవేశపెట్టిన బీజేపీ సర్కార్
- పూర్తిస్థాయిలో అమలు కాని మార్గదర్శకాలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు..



బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తుకంటే రాజకీయ పార్టీల అజెండాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో డిగ్రీ విద్యపై గందరగోళం నెలకొంది. దేశంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ని కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం ఉన్న విద్యా విధానాల్లో భారీ మార్పులు చేసింది. మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లకు పెంచింది. కేంద్రప్రభుత్వం ఎన్ఈపీని ప్రకటించిన వేళ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో అమలు చేశారు. దేశంలోనే ఎన్ఈపీకి శ్రీకారం చుట్టిన తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. అయితే ఎన్ఈపీ మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పించలేదు. అయితే ఎన్ఈపీ విధానాలను అంచెలంచెలుగా అమలులోకి తెస్తామని ప్రకటించారు. గత ఏడాది రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ప్రచారం వేళ కాంగ్రెస్ పార్టీ ఎన్ఈపీ అంటే నాగ్‌పూర్ ఎడ్యుకేషన్ పాలసీ అని, మేం వ్యతిరేకిస్తామని ప్రకటించుకున్నారు. ఇలా ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో తిరుగులేని మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్ఈపీని రద్దు చేస్తున్నామని అందుకు ప్రత్యామ్నాయంగా స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎస్ఈపీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. అందుకు మార్గదర్శకాలకోసం కమిటీని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ నేతృత్వంలోని కమిటీ మూడేళ్ల డిగ్రీ కొనసాగించడం సముచితమని తీర్మానించింది. నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ ఎంపిక చేసుకునే సొంత విధానం సరికాదని సూచించింది. గతంలో మాదిరిగానే మూడేళ్ల డిగ్రీ కొనసాగించేలా కమిటీ మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఖరారు చేయాల్సి ఉండేది. అయితే ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఎన్నికల ప్రక్రియ జూన్ మొదటివారం దాకా కొనసాగనుంది.

ప్రారంభం కాని అడ్మిషన్లు

ఎన్నికల్లయ్యేదాకా ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. నాలుగురోజులక్రితం ద్వితీయ పీయూసీ ఫలితాలు వెల్లడయ్యాయి. రాష్ట్రం నుంచి ఏకంగా 5.52 లక్షలమంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. భవిష్యత్తు చదువుకోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. వృత్తి విద్యాకోర్సుల్లో మార్పులు లేకున్నా ఇతరత్రా డిగ్రీ కోర్సులను ఎలా అమలు చేస్తారనేది ప్రశ్నార్థకం అవుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడంతో మూడేళ్ల డిగ్రీ అమలు చేసే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. ఇదే విషయమై విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో ఆందోళన కొనసాగుతోంది. కళాశాలల యాజమాన్యాలు, ఉన్నత విద్యావిభా గం తీసుకునే నిర్ణయాలకోసం ఎదురుచూస్తున్నా రు. కళాశాలలు ఈ విషయంలో ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు. సాధారణంగా పీయూ ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజే డిగ్రీ కళాశాలల అడ్మిషన్లకోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. కొన్ని ప్రైవేట్ కళాశాలలు అడ్మిషన్లు ప్రారంభించాయి. కానీ ప్రభుత్వ కళాశాలలు అనుమతులకోసం ఎదురుచూస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదు. రాష్ట్రంలోని 31 విశ్వవిద్యాలయాలలో భిన్నమైన అకడమిక్ విధి విధానాలను పాటిస్తున్నారు. వాటిని ఏకరూపంలో తీసుకొచ్చేందుకు ప్రత్యేక కమిటీ తీర్మానించింది. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో అమలు కావడం సాధ్యం కాదని తెలుస్తోంది. అయితే విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. వృత్తి విద్యాకోర్సుల్లో పోటీ పెరిగిన నేపథ్యంలో సమయం గడిచిపోతున్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాలను పక్కన పెట్టాలని సూచిస్తున్నారు.

మైసూరు యూనివర్శిటీ



హాస్యనటుడు ద్వారకేశ్
కన్నుమూత

- నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా కన్నడ సినిమా రంగంలో విశేష ఖ్యాతి
- సీఎం, డీసీఎం సహా పలువురు ప్రముఖుల సంతాపం
- నేడు అంత్యక్రియలు



బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నడ సినిమా రంగంతో ఆరు దశాబ్దాల అనుబంధం కలిగి ప్రతికోణంలోనూ ఆయన మార్కు కనిపించేలా వ్యవహరించిన హాస్య దిగ్గజం ద్వారకేశ్ (81) కన్ను మూశారు. వయో సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన నగరంలోని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని నివాసంలోనే తుది శ్వాస వీడారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి కాసేపు నిద్రించేందుకు వెళ్లిన సమయంలోనే కన్నుమూశారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా కన్నడ సినిమా రంగానికి ఆయన విశేష సేవలందించారు. డాక్టర్ రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, అంబరీశ్ వంటి ప్రముఖుల సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. 1942 ఆగస్టు 19న శ్యామరావు, జయమ్మ దంపతులకు మైసూరు జిల్లా హుణసూరులో జన్మించారు. 1966లో తుంగా బ్యానర్స్ ఏర్పాటు చేసి 1969లో 'మేయర్ ముత్తణ్ణ' ద్వారా పేరొందారు. 15 సినిమాలకు దర్శకుడిగాను, 50 సినిమాలకు నిర్మాతగాను వ్యవహరించారు. 300 సినిమాలలో ఆయన నటించారు. కన్నడ సినిమా రంగానికి సంబంధించి ప్రముఖ నటులందరితో కలసి పనిచేశారు. 'నీ బరద కదాంబరి' అనే సినిమాకు తొలిసారి దర్శకత్వం వహించారు. ఆఫ్రికాలో శీల, కిలాడీలు వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయనకు ఇద్దరు భార్యలు అంబుజ, శైలజలు కాగా అందరూ కలసి ఉండేవారు. అయితే మొదటి భార్య మూడేళ్లక్రితం ఇదే రోజున కన్నుమూశారు.

ప్రముఖుల నివాళి

నటుడు ద్వారకేశ్ మృతి పట్ల సీఎం సిద్దరామయ్య తీవ్ర సంతాపం తెలిపారు. ప్రముఖ నటుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ కన్నడ సినిమా రంగానికి సేవలందించిన ముఖ్యులలో ద్వారకేశ్ ఒకరని కొనియాడారు. మాజీ ప్రధాని దేవెగౌడ స్పందిస్తూ దశాబ్దాలకాలంగా ద్వారకేశ్‌ను చూస్తున్నానని నిబద్ధత, క్రమశిక్షణ కల్గినవారన్నారు. మాజీ సీఎంలు యడియూరప్ప, కుమారస్వామి, బసవరాజ్ బొమ్మైతోపాటు పలువురు సంతాపం తెలిపారు. సినిమా రంగానికి చెందిన దిగ్గజ నటులు రజనీకాంత్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన ఆత్మీయ మిత్రుడిని కోల్పోవడం బాధ కలుగుతోందని ట్వీట్ చేశారు. ఎంపీ సుమలత, దర్శన్, కిచ్చ సుదీప్, రవిచంద్రన్ తదితరులు సంతాపం తెలిపారు.



ద్వారకేశ్ భౌతికకాయం

నేడు అంత్యక్రియలు

నటుడు ద్వారకేశ్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజలు, అభిమానుల సందర్శననిమిత్తం రవీంద్ర కళాక్షేత్రలో ఉదయం 7.30 గంటలనుంచి 11 గంటల వరకు పార్థివదేహాన్ని ఉంచుతామన్నారు. అనంతరం చామరాజపేటలోని స్మశానవాటికలో అంత్యక్రియలు కొనసాగుతాయన్నారు. అంత్య క్రియలకు పలువురు ప్రముఖులు హాజరు కానుండంతో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. పలు రాజకీయ, సినీ ప్రముఖులు రానున్నారు. ద్వారకేశ్‌కు కన్నడ, తమిళ సినీ రంగాలతో విశేష అనుబంధం ఉందని, ఆయన మృతి తీరని లోటని పలువురు సినీ ప్రముఖులు పేర్కొన్నారు.

నేడు రాష్ట్రానికి రాహుల్‌గాంధీ

- మండ్య, కోలారు నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొననున్న కాంగ్రెస్ నేత



బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రానున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రచారంలో జోరు పెంచనుంది. ఆయన మండ్య, కోలారు అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు. కేరళలోని సొంత నియోజకవర్గం వయనాడులో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడనుంచి మండ్యకు హెలికాప్టర్‌లో వెళ్తారు. కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణగౌడ అలియాస్ స్టార్ చంద్రు తరపున ప్రచారం చేస్తారు. ఇదే స్థానం నుంచి జేడీఎస్ కీలక నేత హెచ్‌డీ కుమారస్వామి పోటీలో ఉన్నారు. ఆ తర్వాత సాయంత్రం కోలారుకు వెళ్తారు. అక్కడి అభ్యర్థి గౌతమ్‌కుమార్ తరపున ప్రచారం చేస్తారు. ఎన్నికల సభలను ముగించుకుని బెంగళూరుకు వచ్చి ఢిల్లీ వెళ్తారు. కాంగ్రెస్ పార్టీ తరపున అగ్రనేతల రాక ఇదే ప్రథమం. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర కాంగ్రెస్ మూడు నెలల ముందే ప్రారంభించింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు మాత్రమే ఎన్నికలకు సంబంధించి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా పలుమార్లు వచ్చారు. రాహుల్‌గాంధీ రెండు నియోజకవర్గాల పర్యటన తర్వాత మరింతమంది పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రచారానికి ప్రియాంకగాంధీ రానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఇంకా తేదీలు ఖరారు కాలేదు. కానీ బీజేపీ నుంచి అగ్రనేతలు నిరంతరంగా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే శివమొగ్గ, కలబురగి సభల్లో పాల్గొన్నారు. తాజాగా రెండు రోజులక్రితం మైసూరులో బహిరంగసభ, మంగళూరులో రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఇక కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మండ్యలో పర్యటించారు. కేంద్రమంత్రులు జైశంకర్ దాదాపు రెండు మూడు నెలలుగా రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. స్మృతి ఇరానితో పాటు పలువురు రాష్ట్రంలో ప్రచారం కొనసాగిస్తున్నారు. మరోసారి ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉందని బీజేపీ నేతలు అంటున్నారు. కానీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రావడం ఇదే ప్రథమం. కాంగ్రెస్ ప్రచారంలో పలు నియోజకవర్గాల్లో పర్యటించి ఓటర్లకు గ్యారెంటీ పథకాలను వివరించనున్నారు. సోమవారం రాహుల్‌గాంధీ రాష్ట్రానికి వచ్చారు. ఢిల్లీ నుంచి మైసూరుకు వచ్చిన ఆయన అక్కడనుంచి వయనాడ్‌కు వెళ్లారు. మైసూరు ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు రాలేదు.

22 వరకు డెడ్‌లైన్

- తీరు మార్చుకోకపోతే బహిష్కరణ
- ఈశ్వరప్పపై వేటుకు అధిష్టానం సిద్ధం..!



బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో సుదీర్ఘకాలంపాటు తిరుగులేని నేతగా కొనసాగి ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన కేఎస్ ఈశ్వరప్పపై పార్టీ అధిష్టానం వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈశ్వరప్ప శివమొగ్గ నుంచి లోక్‌సభ బరిలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. ఇదే స్థానం నుంచి యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఈశ్వరప్ప ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని 2023లో భావించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో హావేరి నుంచి కుమారుడు కాంతేశ్‌కు టిక్కెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే కుమారుడికి టికెట్ దక్కకపోవడంతో రెబెల్‌గా మారారు. పార్టీ సీనియర్ నేత యడియూరప్ప కుట్రతోనే తన కుటుంబానికి టిక్కెట్ దక్కలేదని బహిరంగంగానే ప్రకటించారు. యడియూరప్ప పెద్ద కుమారుడు రాఘవేంద్ర ఎంపీగాను, చిన్న కుమారుడు విజయేంద్ర ఎమ్మెల్యే పదవితోపాటు పార్టీ అధ్యక్షుడిగా ఉండడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రారంభంలో పార్టీ అగ్రనేతలు రాజీ చర్చలకు ప్రయత్నించగా ఈశ్వరప్ప అందుబాటులో లేకుండా పోయారు. స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఢిల్లీకి ఆహ్వానించారు. ఢిల్లీ వెళ్లేలోగానే అమిత్‌షాతో చర్చలు జరుపుతానని, అయితే నామినేషన్ దాఖలులో వెనుకడుగు లేదని ప్రకటించారు. ఇదే సమాచారం అమిత్‌షాకు తెలియడంతో ఢిల్లీలో అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రనేతలు ఎవరూ ఈశ్వరప్పతో చర్చలు జరిపే పరిస్థితి లేదు. అధిష్టానం నుంచి ఎవరూ వచ్చేందుకు సుముఖత చూపడం లేదు. ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు. ఈలోగా ఈశ్వరప్ప నామినేషన్ ఉపసంహరించుకోకపోతే ఆయనపై వేటు వేసేందుకు బీజేపీ సిద్ధమైంది. ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర అభిప్రాయపడ్డారు. కాగా ఈశ్వరప్ప శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకులు తన పట్ల అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాగా బెళగావిలో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్ దాస్ అగర్వాల్‌ను మీడియా అడిగిన ప్రశ్నకు ఈశ్వరప్ప ఎవరో తెలియదంటూ దాటవేశారు. పార్టీకి ఎవరూ గొప్ప కాదన్నారు. విధి విధానాలే ముఖ్యమన్నారు. ఈశ్వరప్పపై వేటు వేసేందుకు అధిష్టానం సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.

జోరందుకున్న నామినేషన్లు

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రెండో విడత నామినేషన్లు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 లోక్‌సభ స్థానాలకు గాను 40మంది అభ్యర్థులు 49 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. మంగళవారం కొప్పళ మినహా మిగిలిన 13 చోట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. 39మంది పురుషులు 47 నామినేషన్లు, ఉత్తరకన్నడ నుంచి ఓ మహిళ 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు 123మంది నామినేషన్లు వేసినవారిలో ఉన్నారు. వీరిలో 112మంది పురుషులు కాగా 11మంది మహిళలు ఉన్నారు. కాగా సురపుర శాసనసభ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఇరువురు నామినేషన్లు దాఖలు చేశారు.




పోలింగ్ శాతాన్ని పెంచడమే ధ్యేయం..

- ఉద్యోగులకు సెలవు ఇవ్వకపోతే కఠిన చర్యలు
- రాష్ట్ర ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా





బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ శాతాన్ని పెంచడమే ధ్యేయమని, పోలింగ్ రోజున అన్ని సంస్థలు ఉద్యోగులకు సెలవు ఇవ్వాల్సిందేనని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ మీనా హెచ్చరించారు. మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన పోలింగ్ శాంతియుతంగా, న్యాయబద్ధంగా జరిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల నగర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు అవుతోందని విచారం వ్యక్తం చేశారు. పోలింగ్ శాతం పెంచేందుకు ప్రాంతాల వారీగా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్రంలో రెండువిడతలుగా పోలింగ్ జరుగనుందన్నారు. పోలింగ్ జరిగే రెండు రోజుల్లోనూ ప్రభుత్వ, ప్రైవైట్ రంగ సంస్థలు ఉద్యోగులకు సెలవు ఇచ్చి పోలింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలన్నారు. సెలవు మంజూరు చేయకపోతే కఠిన చర్యలకు వెనుకాడేది లేదన్నారు. రాష్ట్రంలో ఏప్రిల్ 26తో పాటు మే నెల 7వ పోలింగ్ జరుగుతుందన్నారు. రెండు రోజులు సెలవు ప్రకటించాలన్నారు. బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ఐటీ, ఎంఎన్‌సీ కంపెనీల సీఈఓలు, ఇతర స్థాయి ముఖ్యులను సంప్రదించామన్నారు. ఉద్యోగులు, సిబ్బందికి పోలింగ్ రోజున సెలవు ఇవ్వాలని సూచించామన్నారు. తక్కువ పోలింగ్ శాతం నమోదు అయ్యే బెంగళూరు పాలికె పరిధిలోని 1800 బూత్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మరో 5వేల బూత్‌లను గుర్తించామన్నారు. రాష్ట్రంలో తక్కువ పోలింగ్ నమోదయ్యే బూత్‌ల్లో కళ్యాణకర్ణాటక పరిధిలోని బీదర్ కూడా ఉందన్నారు. దాదాపు 6800 బూత్‌లలో సుమారు 35శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. తక్కువ పోలింగ్ బూత్‌లు ఐటీ కంపెనీల పరిధిలో ఉన్నాయి. అపార్ట్‌మెంట్, రెసిడెన్సీ ఫోరంలతో పాటు ప్రాంతాల వారీగా ఓటు హక్కుపై చైతన్యం కలిగిస్తున్నామన్నారు. ప్రజలను తప్పనిసరిగా ఓటు వేయాల్సిందే అనే ఒత్తిడి తీసుకురాలేమని, సొంతంగా ఓటు వేయాలనే ఆలోచన ప్రతి పౌరుడిలోను రావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం బరువుగా కాకుండా, బాధ్యతగా భావించాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యా వంతులు, ఉద్యోగులు విరివిగా పోలింగ్‌లో పాల్గొనాలన్నారు. జలమండలి, బెస్కాంతో పాటు అత్యవసర విభాగాల్లో పనిచేసే సిబ్బందికి ఓటు వేసే వెసలుబాటు కల్పించాల్సిందే అన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.83	1,577.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	162	269
సామర్థ్యం (టీఎంసీలు)	3.93	3.19

బసవన్న వచనాలతో సామాజిక మార్పు



బసవన్న వచన గాన కార్యక్రమంలో విద్యార్థులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16: 12వ శతాబ్దంలో వచనాల ద్వారా సామాజిక విప్లవం తెచ్చిన ఘనత జగజ్యోతి బసవన్నకు దక్కుతుందని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ళగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయన కోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన బసవన్న వచన గాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సామాజిక మార్పుకోసం బసవన్న, బుద్ధ, అంబేద్కర్ శ్రమించారని తెలిపారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ అభివృద్ధి అధికారిణి సుమలత, చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేడు ఆంద్రాళ్‌లో సీతారామ రథోత్సవం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16: నగరంలోని 8వ వార్డు రామదేవర ఆలయంలో బుధవారం రామనవమి సందర్భంగా వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్ ఆర్.వెంకటరెడ్డి, కార్పొరేటర్ రామాంజినేయులు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, పుష్పాలంకరణ ఉంటాయన్నారు. మధ్యాహ్నం సీతారామ కల్యాణం నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం చేస్తారని, తదనంతరం సాయంత్రం రథోత్సవం జరుగుతుందన్నారు. ఇందుకోసం ఇప్పటికే రథాన్ని సిద్ధం చేశామని, గుడి దగ్గర పనులు అన్ని పూర్తి చేశామన్నారు. భక్తులు తరలివచ్చి రాముని అనుగ్రహం పొందవలసిందిగా కోరారు.

పుచ్చకాయలకు పెరిగిన డిమాండ్



తాజాగా నోరూరిస్తున్న పుచ్చకాయ ముక్కలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16: కొద్దిరోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. బళ్లారి ప్రజలకు 40నుండి 45డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు కొత్తకాకపోయినప్పటికీ గత కొద్ది రోజులుగా పుచ్చకాయతో పాటు, మజ్జిగ వంటి చల్లటి పానీయాలకు డిమాండ్ పెరిగింది. పుచ్చకాయముక్కలు కిలో రూ.30నుండి 40దాకా విక్రయిస్తున్నారు. వేసవిలో జిల్లా ప్రజలు భోజనం కంటే చల్లటి పండ్ల రసాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

వైభవంగా నాగనాథేశ్వర స్వామి రథోత్సవం



సిరిగేరిలో నాగనాథేశ్వర స్వామి రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 16 : కురుగోడు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన నాగనాథేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి యేటా ఈ రథోత్సవాన్ని జిల్లాలో కన్నుల పండువగా నిర్వహించుకుంటారు. గత ఐదు రోజులుగా నాగనాథేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రథోత్సవం సందర్భంగా శిరిగేరమ్మ దేవాలయంలో 4 గంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. శిరిగేరితో పాటు కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి, కంప్లి, గంగావతి, హోస్పేట, సింధనూరు, రాయచూరు, ఆదోని తదితర పట్టణాలు, గ్రామాల నుంచి భక్తాదులు తరలివచ్చి రథానికి పూలు, పండ్లు కొబ్బరికాయలతో మొక్కులు సమర్పించుకున్నారు.

ఎవరి ఎత్తులు వారివే!



కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం



బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

ఐదు హామీలే ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ - మోదీ హవాతో ముందుకెళుతున్న బీజేపీ

బళ్లారి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కురుక్షేత్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గెలుపు కోసం ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ముందుకు సాగుతున్నాయి. ఇప్పటి వరకూ బీజేపీ, కాంగ్రెస్, ఎస్‌యూసీఐ, ఇండిపెండెంట్లు ఇలా మొత్తం ఐదుగురు నామినేషన్లు వేసినా.. ప్రధానంగా పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉంది. బీజేపీ తరపున మాజీ మంత్రి బి. శ్రీరాములు, కాంగ్రెస్ నుంచి సండూరు ఎమ్మెల్యే తుకారాం నామినేషన్లు వేశారు బీజేపీ పూర్వం ఉన్న పట్టును అలాగే నిలుపుకోవాలని ప్రయత్నం చేస్తుంటే.. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఆపార్టీ నాయకులు గట్టి పట్టుదలతో ఉన్నారు.

బీజేపీ అభ్యర్థి శ్రీరాములు 2004 నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు పోటీ చేస్తూ వచ్చారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం కూడా రాజకీయ చతురుడు. ఆయన 2008 నుండి ఇప్పటికి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. ప్రస్తుతం తుకారాం సండూరు ఎమ్మెల్యేగానే ఉన్నారు. బళ్లారి లోక్‌సభ స్థానం 2008లో ఎస్టీ స్థానానికి రిజర్వు కావడంతో అప్పటి నుండి వాల్మీకి వర్గానికి చెందిన నాయకులే బళ్లారిలో ఎంపీగా గెలుస్తూ వచ్చారు.

సండూరు ఎమ్మెల్యే తుకారాం రాజకీయ బ్యాక్ బోన్ అంతా సంతోష్ లాడ్ ఫ్యామిలీనే. తుకారాం బి-టెక్ వరకూ చదువుకున్నారు. ఆయన మంచి మాటకారి. అధికారులతో ఏ పనులు ఎలా చేయాలో బాగా తెలిసిన వ్యక్తి. పైగా పెద్దలతో ఎలా మసలుకోవాలో తెలిసిన నేర్పరి. సీఎం సిద్దరామయ్యకు నమ్మిన బంటు. సిద్దరామయ్య వద్ద తుకారాం మాటకు మంచి విలువ ఉంది. మోదీ హవా కొనసాగుతున్న వేళ అదీ మాజీ ఎంపీ, మాస్ లీడర్‌గా పేరుండే శ్రీరాములుపై సరైన అభ్యర్థినే కాంగ్రెస్ నిలిపిందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. తుకారాం నియోజకవర్గంలో ఓటర్లతో పాటు కులపెద్దలను కలిసి వారి ఆశీర్వచనాలు తీసుకుంటూ ఉంటారు. కులపెద్దల వద్ద మంచోడు అనే పేరు సంపాదించడం తుకారాం ప్రత్యేకత.

కాంగ్రెస్ కూడా ఎలాగైనా తుకారాంను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి 1999 ముందు ఉండే పూర్వ వైభవం తేవాలని కృషిచేస్తోంది. దీంతో ఐదు గ్యారెంటీలే తమను గెలిపిస్తాయనే విశ్వాసంతో కాంగ్రెస్ ఉంది. వాటినే తనప్రచారాస్త్రాలుగా మార్చుకుంటోంది.

బీజేపీ అభ్యర్థి శ్రీరాములుకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకమని చెప్పవచ్చు. వాల్మీకి సముదాయానికి చెందిన మాస్ లీడర్‌గా పేరు ఉండే శ్రీరాములు ఇంతకు ముందు జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి నాగేంద్ర చేతుల్లో ఓడిపోయారు. దీంతో ఆయన రాజకీయ భవిషత్తు ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని శ్రీరాములు కృతనిశ్చయంతో పని చేస్తున్నారు. మోదీతోనే దేశాభివృద్ధి అని బీజేపీ తరపున ప్రచారం చేస్తున్నారు. ఆయన వ్యూహాత్మకంగా మోదీ విజయాలపైనే ఆధారపడి ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉండే అత్యంత ప్రతిష్ఠాత్మక స్థానాల్లో బళ్లారి మరీ ముఖ్యమైనది. ఈనేపథ్యంలో గెలుపు కోసం రెండు పార్టీలూ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నాయి. మొత్తం మీద బళ్లారి రాజకీయం చాలా ఆసక్తి కరంగా మారింది.

కుమారస్వామి వ్యాఖ్యలపై మహిళల నిరసన

బళ్లారిరూరల్, ఏప్రిల్ 16 : గ్యారెంటీలతో గ్రామీణ మహిళలు దారితప్పుతున్నారంటూ హెచ్‌డీ కుమారస్వామి నోరుజారిన వైనంపై కాంగ్రెస్ నిరసన తెలిపింది. బళ్లారి నగరంలో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మహిళా జిల్లా అధ్యక్షురాలు మంజుళ, మేయర్ శ్వేత నేతృత్వంలో నిరసన తెలిపి కలెక్టర్ కార్యాలయం వద్ద అసిస్టెంట్ కలెక్టర్ జుబేరాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఐదు గ్యారెంటీలతో ప్రజలు సంతోషంగా వున్నారని దానిని చూసి ఓర్వలేక హెచ్‌డీ కుమారస్వామి తుమకూరు రోడ్‌షోలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడటం చాలా నీచమన్నారు. ఈ కార్యక్రమంలో బుడా అధ్యక్షులు అంజనేయులు, బోయపాటి విష్ణువర్దన్, మేయర్ శ్వేత, కార్పొరేటర్ రాజేశ్వరి, కార్పొరేటర్లు గాదెప్ప, రాజేశ్వరి, కాంగ్రెస్ ప్రముఖులు అసొండి నాగరాజుగౌడ, ముండ్రిగి నాగరాజు, షమీమ్‌జక్లీ, లక్ష్మీ, కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

తుకారామ్ గెలుపు కోసం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

కంప్లి, ఏప్రిల్ 16 : జిల్లా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పలు గ్రామాల్లో గత రెండు రోజులుగా పర్యటిస్తూ ప్రచారం చేపడుతున్నారు. దమ్మూరు, కోశూరు, బైలూరు, మదిరి, కగ్గల్లు, సిద్దమ్మనహళ్లి, బాదనట్టి, తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఎన్నికల్లో ప్రకటించిన ఐదు పథకాలను అమలు జరిపిందన్నారు. అలాగే తమ ఎంపీ అభ్యర్థి తుకారామ్ కూడా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందువల్ల అందరూ తమ అమూల్యమైన ఓటును తమ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కగ్గల్లు గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

సంగనకల్లు గ్రామంలో మంత్రి నాగేంద్ర ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 16 : తాలుకాలోని సంగనకల్లు గ్రామంలో లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం బళ్లారి ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి తుకారామ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత కరెంటు, బస్ పాస్, రేషన్‌తో పాటు ప్రతి మహిళకు రూ. రెండు వేలు అందిస్తోందన్నారు. తుకారామ్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంగనకల్లు గ్రామంలో మాజీ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు యర్రమ్మ అంజినప్ప, బీజేపీ ప్రముఖులు వామన్న, ఈరన్న, సన్న ఈరన్న, ఉలిగప్పతో పాటు ఆయన ఆధ్వర్యంలో పలువురు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సంగనకల్లులో ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, ముండ్రిగి నాగరాజు, గోవర్దన్ రెడ్డి, విజయ్‌కుమార్, గ్రామ ప్రముఖులు దుర్గన్న, పునిత్, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పటిష్టతకు ప్రతి ఓటూ కీలకమే

స్వీప్ కమిటీ నోడల్ అధికారి రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16: ప్రజాస్వామ్య పటిష్టతకు ప్రతిఒక్క ఓటు అవసరమేనని, ఓటింగ్‌లో అందరూ పాల్గొనాలని జిల్లా స్వీప్ కమిటీ నోడల్ అధికారి రాహుల్ శరణప్ప పేర్కొన్నారు. జిల్లాపాలనాధికారి, జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్‌పై అవగాహన ప్రచారంలో భాగంగా నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి స్పీకథాన్ కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల మూడో విడత పోలింగ్ మే 07న జరుగుతుందని , యువజన సంఘం తప్పకుండా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలని కోరారు. మంచి సమాజం, ప్రజాస్వామ్యం దృష్ట్యా ఎన్నికలు జరగాలంటే అందరి భాగస్వామ్యం అవసరమని ఓటుపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఓటు అనేది ఆయుధం లాంటిందని, ప్రజల్లో ఓటు హక్కును పెంపొందించేందుకు ప్రలోభాలకు లొంగకుండా ఉత్తమ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు జిల్లాస్వీప్ కమిటీ అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. జిల్లాస్థాయి స్పీకథాన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు సరిఫ్టికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అందరిచేత ప్రమాణం చేయించారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కులపతి రుద్రేశ్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ఖలీల్‌సాబు, జిల్లా పంచాయితీ ఉప కార్యదర్శి గిరిజాశంకర్, జిల్లా పంచాయితీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగేశ్ శివాచార్య, జిల్లాపంచాయితీ అధికారులు, సిబ్బంది విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రమాణం చేయిస్తున్న రాహుల్ శరణప్ప, తదితర అధికారులు

ఏళుపడగల నాగప్పకు ప్రత్యేక పూజలు



కంప్లి, ఏప్రిల్ 16 : తాలుకా పరిధిలోని బుక్కసాగర వద్ద కొండల్లో వెలసిన ఏళుపడగల నాగప్పకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు చేపట్టారు. ఉభయ జిల్లాలతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించారు.

గ్యారెంటీ పథకాలతోనే కాంగ్రెస్ గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పళ్ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్

సిరుగుప్ప, ఏప్రిల్ 16 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఐదు గ్యారెంటీ పథకాలే తమ గెలుపుకు కారణమవుతాయని కొప్పళ్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం యల్లమ్మ శాల ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పరిపాలన వస్తే ప్రతి మహిళకు బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ చేస్తామని తెలిపారు. రాజశేఖర్ ఇత్నాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు హుస్సేన్‌సాబ్, బీఎం సతీష్, కరిబసప్ప, పవన్‌కుమార్ దేశాయ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్న విక్రయ కేంద్రాలను మళ్లీ తెరవాలి



తమ సమస్యలను లోకాయుక్త అధికారులకు తెలుపుతున్న జొన్న రైతులు

సిరుగుప్ప, ఏప్రిల్ 16 : జొన్నల విక్రయ కేంద్రాలను మరలా ప్రారంభించాలని రైతులు లోకాయుక్త అధికారులను కోరారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం సీడీపీవో భవనంలో లోకాయుక్త అధికారులు తాలుకాలో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల అధికారుల పనితీరును పరిశీలించారు. ప్రధానంగా జొన్నల విక్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ పంటకు మాత్రం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. రబీ సీజన్‌కు సంబంధించి జొన్నల విక్రయాల నమోదును నిలిపివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఏపీఎంసీ ఆవరణంలో జొన్నల ట్రాక్టర్లు కిలో మీటర్ల పొడవునా ఉన్నాయని, ఇప్పుడు చూస్తే టార్గెట్ రీచ్ పూర్తయిందని, ఇక జొన్నల కొనుగోలు చేయడం కుదరదని అధికారులు తెలపడంతో దిక్కుతోచని రైతులు లోకాయుక్త ఎస్పీ సిద్దరాజుకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి తహసీల్దార్ షంషాలం మాట్లాడుతూ దీనిపై జిల్లా అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లోకాయుక్త సీఐ సంగమేష, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

బోరు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లాపంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సదాశివ ప్రభు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16: విఫలమైన గొట్టపు బావులవద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో సంబంధిత గ్రామపంచాయితీ అభివృద్ధి అధికారులే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని విజయనగరం జిల్లా పంచాయితీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సదాశివ ప్రభు హెచ్చరించారు. హొసపేటలోని జిల్లాపంచాయితీ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త గొట్టపు బావులు వేయాలని, అవి ఫెయిల్ అయితే కవర్ వేసి కేసింగ్ పైపుకు బ్లాక్ నిర్మించాలన్నారు.ఆయా గ్రామాల అభివృద్ధి అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పీడీఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాకలెక్టర్ దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించిన మేరకు విఫలమైన గొట్టపు బావులను మూసివేసే బాధ్యతను గ్రామ పరిధిలోని పీడీఓలకు అప్పగించారు. సంబంధిత తాలూకా కార్యనిర్వాహక అధికారులు దీనిని పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు.

ఓటు హక్కుపై కాగడాల ర్యాలీ

కంప్లి, ఏప్రిల్ 16 : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మంగళవారం పట్టణ పంచాయతీ సిబ్బంది, సంఘ సంస్థ నేతలు కుడితినిలో వాడవాడలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుడితిని పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి సూర్యకాంత్ మాట్లాడుతూ మే నెల 7న అమూల్యమైన ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.

హోసూరు జోన్

ఎండిన బోరుబావిని వదిలేశారు



మూతలేకుండా వదిలేసిన బోరుబావి

హోసూరు, ఏప్రిల్ 16: హోసూరు సమీపంలో కామరాజ్ కాలనీలోని 10వ క్రాస్ వీధిలో పదేళ్లుగా ఉపయోగపడిన బోరుబావి ఇటీవల ఎండిపోయింది. దీంతో కార్పొరేషన్ ద్వారా మరమ్మత్తు పనులు చేశారు. మరమ్మతుల పనుల సంగతి ఎలా ఉన్నా బోరుబావిపై మూత లేకుండా వదిలేశారు. స్థానికంగా ఈ ప్రాంతంలో వెయ్యికి పైగా నివాసాలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది పిల్లలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, అంతే సంగతులు. కార్పొరేషన్ పరిధిలో కొన్ని వందల బోరు బావులు ఎండిపోవడంతో చాలా చోట్ల బోరులు వేసి మూతలేకుండావదిలివేశారు. ఇలా ఎండిపోయిన బోరుబావులపై మూతకప్పి ఉంచి కనీస జాగ్రత్తలు పాటించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



పోలీస్ అధికారులతో సమావేశమైన ఎస్పీ నిఖిల్

పోలింగ్ కేంద్రాలలో కలెక్టర్ తనిఖీలు

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 16: కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో 6 శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని 1888 పోలింగ్ బూత్‌లలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సరయు మంగళవారం తనిఖీలు చేశారు. అభ్యర్థుల సమాచార పోస్టర్, ఓటరు నమోదు అధికారి మాన్యువల్, పోలింగ్ స్టేషన్‌లో పాటించాల్సిన విధి విధానాలను పరిశీలించారు. ఈనెల 19న పోలింగ్ జరగనున్న సంగతి విదితమే. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే పోలింగ్ బూత్‌లకు అవసరమైన సామగ్రిని చేర్చేలా అన్ని చర్యలు చేపడతామన్నారు. కృష్ణగిరి దేవాదాయ శాఖ కమీషనర్, సహాయ ఎన్నికల అధికారి సి.బాబు, ప్రైవేట్ కమీషనర్లు షణ్ముగం, గోపినాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలి

రాయచూరు, ఏప్రిల్ 16 : నేరాల నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రస్తుతం లోకసభ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.నిఖిల్ సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మాసిక క్రైం మీట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పారదర్శకంగా అప్రమత్తంగా ఉండడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా పోలీస్ యంత్రాంగం పని చేయాలన్నారు. అదే సమయంలో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండవద్దన్నారు. నేరాల నియంత్రణకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.

బీజేపీ అభ్యర్థి భవిష్యత్తుపై ఉత్కంఠ

- రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ కుల వివాదంపై 19న గుల్బర్గా హైకోర్టు తీర్పు



రాజా అమరేశ్వర్ నాయక్(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 16 : రాయచూరు లోకసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ అభ్యర్థిత్వంపై సందిగ్ధం నెలకొంది. ఎస్టీ రిజర్వు నియోజక వర్గంగా ఉన్న రాయచూరు నుంచి రెండవ సారి పోటీ చేస్తున్న రాజా అమరేశ్వర్ నాయక్‌కు కుల వివాదం చుట్టుకుంది. మాన్వి తాలూకా కరడిగుడ్డ గ్రామానికి చెందిన నరసింహలు నాయక్ అనే వ్యక్తి రాజా అమరేశ్వర్ నాయక్ కుల ధ్రువీకరణను సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నెల 4 వ తేదీన న్యాయస్థానానికి ఫిర్యాదు చేసిన నరసింహలు నాయక్, బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్ ఎస్టీ కులానికి చెందిన వారు కాదని ఫిర్యాదులో స్పష్టం చేశారు. దీనిపై వాదోపవాదాలను విన్న కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ నెల 19న తుది తీర్పు ఇస్తామని ప్రకటించింది. దీంతో అందరి దృష్టి గుల్బర్గా హైకోర్టు బెంచ్ ఈ నెల 19న ఇచ్చే తీర్పు పై పడింది. కాగా అదే రోజు నామినేషన్‌ల దాఖలుకు చివరి రోజు కావడంతో బీజేపీ అభ్యర్థి విషయంపై సందిగ్ధం నెలకొంది. అదే సమయంలో రాయచూరు నుంచి బీజేపీ టికెట్ ఆశించిన మాజీ ఎంపీ బీవీ నాయక్ ఈ నెల 17వ తేదీ బుధవారం లేదా 18వ తేదీ గురువారం ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన ఒక్క సెట్ బీజేపీ అభ్యర్థిగాను మరో సెట్ ఇండిపెండెంట్ అభ్యర్థిగాను నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో ఆయనకు అధిష్టానమే నామినేషన్ వేయమని ఆదేశించిందా లేకా ఆయన స్వతహాగానే ఈ నిర్ణయం తీసుకున్నారా అన్నదాని పై కూడా సందేహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 19వ తేదీన గుల్బర్గా హైకోర్టు బెంచ్ ఇచ్చే తీర్పు పై సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ అభ్యర్థిత్వం ఆధారపడి ఉంటుందన్నది స్పష్టమవుతోంది.

ఓటు హక్కుపై మహిళా సంఘాల జాతా

రాయచూరు, ఏప్రిల్ 16 : స్వీప్ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటింగ్ జాగృతి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్వయం సహాయక మహిళలు జాగృతి పాదయాత్ర చేపట్టారు. యాత్రను నగరంలోని నగరసభ కార్యాలయం వద్ద జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకున్న ప్రాధాన్యతను ప్రతిఒక్కరు గుర్తించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి రాజ్యాంగం కులం, మతం, ప్రాంతం, లింగ వివక్ష లేకుండా ఓటు హక్కు కల్పించిందని ఆ హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

శ్రీరామనవమి




హిందువులు ఆచరించే ప్రముఖ పండుగలలో శ్రీరామనవమి ఒకటి. పురాణాల ప్రకారం మహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు చైత్రమాసం శుక్ల పక్షం నవమి రోజున జన్మించారు. త్రేతాయుగంలో ఆయన జన్మించినా నేటికీ యుగ పురుషుడిగా శ్రీరాముడు కొలవబడుతున్నాడు. దశరథుడి తర్వాత గొప్పగా ధర్మబద్ధంగా ప్రజారంజక పాలన అందించారు. సకాలంలో వర్షాలు కురుస్తూ పంటలు పండేవి. కరువు అనేది తెలియకుండా సాగింది. అందుకే రామరాజ్యం రావాలని నేటికీ ఆకాంక్షిస్తుంటారు. శ్రీరామనవమి రోజున ఎటు చూసినా ఉత్సవాలు, జాతరలు నిర్వహిస్తారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (వర్ధంతి)



ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చిన 'భారతరత్న' గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో వలసవెళ్లిన తెలుగు దంపతులకు జన్మించారు. దేశ తొలి ఉప రాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా అత్యున్నత హోదాలలో కొనసాగారు. ఉపాధ్యాయుడిగా, ప్రొఫెసర్‌గా, వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవ హరించారు. అత్యంత క్లిష్టకాలంలో ప్రధానులకు మార్గదర్శకం చేశారు. సోవియెట్ యూనియన్‌కు దేశ రెండో రాయబారిగా, బెనారస్ హిందూ యూనివర్సిటీకి నాల్గో వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. ఆయన రచించిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తిం పు పొందింది. ఆయన జయంతిని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా ఆచరిస్తున్నారు. సాహితీరంగంలో నోబెల్ ప్రైజ్‌కు 16సార్లు నామినేట్ అయ్యారు. 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

నిసర్గదత్త మహారాజ్ (జయంతి)



నిసర్గదత్త మహారాజ్ 1897 ఏప్రిల్ 17న బాంబేలో జన్మించారు. అసలు పేరు మారుతి శివరామ్‌పంత్ కాంబ్లి. తత్వవేత్త. సిద్ధరామేశ్వర మహరాజ్ గురువు వద్ద బోధనలు పొందారు. ధ్యానంతో కూడిన నిసర్గ యోగాను బోధించారు. మరాఠీలోని ఆయన బోధనలను మౌరిస్ ఫ్రిడ్‌మన్ అనే వ్యక్తి ఆంగ్లంలోకి 'ఐ యామ్ దట్' పేరిట అనువాదం చేశారు. ఉత్తర అమెరికా, యూరప్‌లలో ఎంతో పేరొందారు. 1981 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

ధనంజయన్స్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత వన్నాడిల్ పుడియావీట్టిల్ ధనంజయన్, శాంతా ధనంజయన్ దంప తులు 'ధనంజయన్స్' గా పేరొందారు. భర్త వన్నాడిల్ 1939 ఏప్రిల్ 17న జన్మించారు. ఆమె 1943 ఆగస్టు 12న జన్మించారు. కథాకళి గురువు చందు పాణిక్కర్ వద్ద శిక్షణ పొందారు. దంపతులు ఇరువురూ నృత్యంలో రాణించి కళాపోషణకు తమవంతు కృషి చేశారు. న్యూయార్క్‌లో వెయ్యిమంది చిన్నారులతో కలసి ప్రదర్శన నిర్వహించి గుర్తింపు పొందారు. నృత్య రత్నాకర, సంగీత నాటక అకాడమీ అవార్డు, మెడాలియన్ ది మెరిట్ యునెస్కో, నృత్య చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

గీత్ సేథి (పుట్టినరోజు)



బిలియార్డ్స్‌లో రాణించిన 'పద్మశ్రీ' గ్రహీత గీత్ సిరిరామ్ సేథి 1961 ఏప్రిల్ 17న ఢిల్లీలో జన్మించారు. రెండు వరల్డ్ రికార్డ్సు, ఆరుసార్లు ప్రొఫెషనల్ లెవెల్ లోనూ, మూడుసార్లు అమెచ్యూర్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌గా గెలుపొందారు. రాజీవ్ ఖేల్ రత్న, అర్జున, కేకే బిర్లా అవార్డు తదితర పురస్కారాలు పొందారు. ఆటో బయోగ్రఫీ 'సక్సెస్ వర్సెస్ జాయ్' పుస్తకం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ప్రకాశ్ పదుకొనెతో కలసి ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' పేరిట క్రీడాభివృద్ధికి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు.

విక్రమ్ (పుట్టినరోజు)



దక్షిణాదిన పేరొందిన ప్రముఖ నటుడు విక్రమ్ 1966 ఏప్రిల్ 17న తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జన్మించారు. అసలు పేరు కెన్నెడీ జాన్ విక్టర్. విభిన్నమైన పాత్రలలో రాణించి జాతీయస్థాయిలో ఒకటి, 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, తమిళనాడు స్టేట్‌ఫిల్మ్ అవార్డు, కళైమామణి పురస్కారం అందుకున్నారు. నటుడు, నిర్మాత, నేపథ్య గాయకుడిగా రాణించారు. పలు కార్యక్రమాలకు రాయబారిగా ఉన్నారు. అంతేకాక ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థుల విద్య, వైద్యం తదితర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

డెలివరీ బాయ్ అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహ నాలను చోరీ చేసిన యువకుడిని బయ్యప్పనహళ్ళి పోలీసులు అరెస్టు చేశారు. జేపీ నగర్ 6వ స్టేజ్ జరగనహళ్ళి నివాసి దీపక్ అలియాస్ దీపు (23)ను అరెస్టు చేశారు. ఇతను స్విగ్గి డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడి నుంచి రూ.3లక్షల విలువైన ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాళాలు వేసిన ఇళ్ల వద్ద ఉంచిన వాహనాలను గుర్తించి చోరీకి పాల్పడేవాడని, అనంతరం తక్కువ రేటుకే సదరు వాహనాన్ని అమ్మేవాడని పోలీసులు తెలిపారు. ఇతడిపై జేపీ నగర్, తిలక్ నగర్, పుట్టేనహళ్ళి, పరప్పన అగ్రహార, హెణ్ణూరు, బేగూరు, కోరమంగల, బసవన గుడి, బనశంకరి, విద్యారణ్యపుర, కోణనకుంటె పోలీస్ స్టేషన్‌లలో మొత్తం 14 కేసులు ఉన్నాయన్నారు. ఇతడి అరెస్టుతో పలు కేసులు కొలిక్కి వచ్చాయన్నారు. ఇన్ స్పెక్టర్ శివకుమార్ నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించారు. కాగా నగరంలోని కత్రిగుప్పె క్రీడా మైదానంలో యువకులకు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న విదేశీ డ్రగ్ పెడ్లర్‌ను సీకే అచ్చుకట్టు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1.75 లక్షల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కత్రిగుప్పెలో డ్రగ్స్ విక్రయాలపై సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్, సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ - ఇరాన్‌ల ఘర్షణ నిభాయించే శక్తి భారత్‌కు ఉంది

» కేంద్రమంత్రి జైశంకర్



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి జైశంకర్

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య సంఘర్షణకు భిన్నమైన ఆందోళనలే కారణమని, నిభాయించే శక్తి భారత్‌కు ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు. నగరంలో మంగళవారం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్‌ఐ)లో 'విశ్వబంధు భారత్' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ప్రపంచంలోని అన్ని సంఘర్షణలు, సమస్యలకు విశ్వబంధు పరికల్పన పరిష్కారమన్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం వేళ మన దేశానికి సమస్య లేకుండా నిర్ణయాలు తీసుకున్నామని, రాయితీ ధరలో ముడిచమురు దిగుమతితోపాటు దేశీయ మార్కెట్‌లో సుస్థిరత కాపాడేందుకు సాధ్యమైందన్నారు. లేని పక్షంలో ఇంధన వనరుల ధరలు భారీగా పెరిగేవన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య సంఘర్షణ విశ్వవ్యాప్తంగా తీవ్రమైన భయాందోళనకు కారణమైందని మంత్రి అభిప్రాయ పడ్డారు. ప్రపంచంలో ఎటువంటి సంఘర్షణలు తలెత్తినా అందరిపైనా ప్రభావం చూపుతుందని, అంతర్జాతీయ స్థాయిలో ముడిచమురు, ఆహార పదార్థాల ధరలు పెరుగు తాయని తద్వారా పలు సమస్యలు తీవ్రమవుతాయన్నారు. వీటన్నింటికీ విశ్వబంధు పరికల్పనే పరిహారం కానుందన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య సంఘర్షణ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారని అన్నారు. ఇరాన్‌లోని ఒక ఓడలో చిక్కుకున్న 17మంది భారతీయులను సురక్షితంగా వాపసు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. 18లక్షమంది భారతీయులు ఈ ప్రాంతంలో నివసిస్తున్నారని వారందరి రక్షణ తమ బాధ్యత అన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ వాతావరణం ఉందని, గాజాలో సంఘర్షణలు కొనసాగుతున్నాయని, భారత్ పసిఫిక్ పరిధిలో పరిస్థితి తీవ్రంగానే ఉందని అన్నారు. ప్రపంచంలోని 20 దేశాలతో పరస్పరం చర్చలు జరుపుతున్నామని ఇటువంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమని అన్నారు. పరస్పరం అర్థం చేసుకోవడం, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమన్నారు. ఏకాభిప్రాయంతో ఎటువంటి సమస్యలు తీరవన్నారు. ఐక్యరాజ్య సమితి కూడా ఇటువంటి విషయాల్లో ఎక్కువ చర్యలు తీసుకోలేదన్నారు. అయితే భారత్ ప్రగతిశీల దేశాలలో గ్లోబల్ సౌత్ పరికల్పనకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జి-20 అధ్యక్షత ద్వారా ప్రపంచం మనంవైపు చూసేలా చేశామన్నారు. 2030 నాటికి 10 ట్రిలియన్‌ల సామర్థ్యాన్ని భారత్‌లో సాధ్యం కానుందని, 2040 నాటికి వికసిత భారత్ మన లక్ష్యమన్నారు. విశ్వబంధు పరికల్పనలో భారత్ బ్రాండ్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యం కోసం దేశంలోని అందరి భాగస్వామ్యం కీలకమన్నారు. 2014కు ముందు భారత్ ఆర్థికంగా ప్రపంచంలో 11వ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం ఐదో స్థానంలో ఉందన్నారు. కంపెనీ సెక్రటరీలకు వృత్తిపరంగా డిమాండ్ పెరిగిందని, దేశ అభివృద్ధికి సీఎస్‌ల పాత్ర కీలకమని కొనియాడారు. ఐసీఎస్‌ఐ బెంగళూరు చాప్టర్ అధ్యక్షుడు వెంకట సుబ్బారావ్ కల్వా, కార్యదర్శి విశ్వాస్ హెగ్డే, ఎస్‌ఐఆర్‌సీ అధ్యక్షుడు ప్రదీప్ బీ కులకర్ణి, కేంద్రమండలి సభ్యుడు ద్వారకనాథ్, ఉపాధ్యక్షురాలు దేవికా సత్యనారాయణ, గోపాలకృష్ణ హెగ్డే తదితరులు ఉన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

పల్లె ప్రజలు చట్టాలపై అవగాహన పొందాలి

» సుప్రీం న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రాంతాల్లో నివసించేవారు చట్టాలపై పొందాలని జాతీయ న్యాయసేవా ప్రాధికార కార్యనిర్వాహక అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా అభిప్రాయ పడ్డారు. దేవనహళ్ళి పరిధిలోని జాలిగె గ్రామంలో జాతీయ న్యాయసేవా ప్రాధికార, రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార సంయుక్త ఆధ్వర్యంలో రామయ్య లా కళాశాల నేతృత్వంలో గ్రామస్తులతో ముఖాముఖి జరిపారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామపంచాయతీ చట్టాలు స్థానిక సంస్థల విధులు అనే అంశాలపై వివరించారు. ప్రపంచాన్ని అరచేతిలో సాంకేతికత వచ్చిందని, చట్టాలు, న్యాయ నిబంధనలు ప్రాథమిక హక్కుల గురించి ప్రజల్లో అవగాహన పెరగాలనే న్యాయ సేవా ప్రాధికార దేశవ్యాప్తంగా ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార కార్యదర్శి జైశంకర్, రామయ్య లా కళాశాల డైరెక్టర్ ఎంఆర్ ఆనందరావ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో ముఖాముఖిలో సుప్రీం న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా

ధర్మరాయస్వామి ఆలయంలో విశేష పూజలు

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరత్‌పేటలోని ధర్మరాయస్వామి ఆలయంలో కరగ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఈసారి కూడా కరగను మోస్తున్న అర్చకుడు జ్ఞానేంద్ర నేతృత్వంలో పలు ధార్మిక కార్యక్రమాలు సాగాయి. సమీపంలోని కబ్బన్‌పార్క్ వద్ద గల ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రౌపదీసమేత ధర్మరాయస్వామి మూర్తులకు విశేష పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కే సతీశ్, ముత్యాలమ్మ దేవస్థాన అర్చకులు బీ సంతోష్ తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. వహ్నికుల క్షత్రియ సామాజిక వర్గీయులు పెద్దసంఖ్యలో భాగస్వామ్యులయ్యారు.



ప్రత్యేక పూజల్లో అర్చకుడు జ్ఞానేంద్ర

ఇద్దరిని రక్షించి ప్రాణాలు కోల్పోయాడు..

» శోకసంద్రంలో కుటుంబం



శ్రీశైల (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇరువురిని కాపాడిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెళగావి జిల్లా రామదుర్గ పరిధిలోని మలప్రభ నదిలో ఆదివారం మధ్యాహ్నం ఇరువురు మునిగిపోతున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. నది సమీపంలోని ఇంట్లో ఉన్న శ్రీశైల ముదుకర్ణ (45)కు సమాచారం తెలిసింది. ఏమాత్రం ఆలోచన చేయకుండా నదిలో దూకి ఇరువురిని రక్షించాడు. అయితే అప్పటికే తీవ్రమైన ఆయాసం రావడంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. రామదుర్గలో ఓ వివాహంలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన వారు వచ్చారు. వారిలో ఒక బాలుడు ఈతకు వెళ్లి ప్రమాదంలో పడ్డాడు. వెంట ఉన్న మరో యువకుడు రక్షించే ప్రయత్నంలో అతను ఇరుక్కున్నాడు. నిమిషాల వ్యవధిలోనే వారిని కాపాడిన శ్రీశైల మాత్రం ప్రాణాలతో గట్టుకు రాలేకపోయాడని ఆయన సోదరుడు నాగరాజు వెల్లడించారు. గతంలో మలప్రభ నది ఒడ్డున మా వ్యవసాయ భూమి ఉందని ఈ ప్రాంతంలో వేడుకకు వచ్చి ఒకేసారి నలుగురు బాలురు ప్రాణాలు కోల్పోయారన్నారు. అటువంటి సంఘటనలు ఇక్కడ జరుగుతుంటాయన్నారు. బాల్యం నుంచి శ్రీశైలకు ఈత వచ్చు అని, ఎన్నోసార్లు సాహసంగా వ్యవహరించి ఎంతో మందిని రక్షించాడన్నారు. వ్యక్తిగతంగా అతను నీటిలో సాహసాలు చేసేవాడని, కానీ అతను చనిపోయే ముందు కూడా ఇద్దరిని రక్షించి ప్రాణాలు కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు సీఎం, డీసీఎం రోడ్‌షో

» మాజీ ఎమ్మెల్యే సంపంగి వెల్లడి



మీడియాతో మాజీ ఎమ్మెల్యే సంపంగి

బాగేపల్లి, ఏప్రిల్ 16: కాంగ్రెస్ పార్టీతోనే దేశ మనుగడ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్ సంపంగి అభిప్రాయపడ్డారు. పట్టణంలో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈనెల 18న బాగేపల్లికి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ కాంగ్రెస్‌యేనన్నారు. అప్పట్లో అదొక్కటే పార్టీ ఉండేదన్నారు. అయితే ఇప్పుడున్న కొన్ని పార్టీల నాయకులు కాంగ్రెస్ ఏం సాధించిందని ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీ మర్రిచెట్టులాంటిదన్నారు. దళితులు, మైనారిటీలు, వెనుకబడినవర్గాలు అన్ని కులాలవారు ప్రయోజనం పొందారన్నారు. 1999, 2008లో తాను ఎమ్మెల్యేగా ఉన్న వేళ బాగేపల్లి మీదుగా పుట్టపర్తికి రైలు మార్గంకోసం రూ.500కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. అదే రీతిలో బెంగళూరుకు వచ్చిన కావేరి నీటిని బాగేపల్లికి పైప్‌లైన్ ద్వారా మళ్లించేలా పోరాటం చేశానన్నారు. దశాబ్దాలపాటు ఈ అంశం చర్చకు వచ్చేలా విజయం సాధించినా అనంతరం ఓటమి పాలయ్యానన్నారు. ప్రస్తుతం చిక్కబళ్లాపుర లోక్‌సభ బరిలో కాంగ్రెస్ నుంచి రక్షా రామయ్య బరిలో ఉన్నారని ఆయనను గెలిపించాలని కోరారు. మీడియా సమావేశంలో వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షుడు మరియప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నారాయణస్వామి, ఆదినారాయణ, గడ్డం నరసప్ప, చల్లా మంజునాథ్, కరిబాబు, మునీర్‌సాబ్, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలను కాపాడుకోవడమే వారి అజెండా



మీడియాతో మాజీ సీఎం సదానందగౌడ తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 16: అన్ని పార్టీలకు ఒక్కో ప్రణాళిక ఉంటుందని అయితే కాంగ్రెస్ అజెండా మాత్రం సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లకు వారి కుర్చీలను కాపాడుకోవడమేనని కేంద్ర మాజీ మంత్రి, మాజీ సీఎం డీవీ సదానందగౌడ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి మాత్రం గడిచిన పదేళ్ల పాలనలో అందించిన ప్రజాసేవను ఉద్దేశించి ప్రధాని మోదీ పేర్కొన్నారన్నారు. దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. కాగా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని 91ఏళ్ల దేవేగౌడ సైతం మోదీ సేవలకు మెచ్చి బీజేపీతో జత కట్టారన్నారు. జేడీఎస్ సిద్ధాంతాలు వేరైనప్పటికీ దేశం కోసం బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విబేధాలు అధికమన్నారు. గతంలో కాంగ్రెస్‌తో జేడీఎస్ జతకట్టినా వారి తీరుతో ఎక్కువరోజులు మనుగడ సాధించలేదన్నారు. అనంతరం బీజేపీవైపు చేరారన్నారు. రాష్ట్రంలోని 28 స్థానాల్లోనూ ఎన్డీయే గెలుస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తూ ఇందుకు కార్యకర్తలు శ్రమించాలని, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మేలూరు బీఎన్ రవికుమార్, లోక్‌సభ అభ్యర్థి మల్లేశ్‌బాబు, సీకల్ రామచంద్రగౌడ, ఆనందేగౌడ, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, రమేశ్‌బాయరి, నరేశ్ సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరపై సన్నాహక సభ

విజయపుర, ఏప్రిల్ 16: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రసిద్ధి చెందిన గంగాదేవి ఆలయ 54వ వార్షిక జాతర ఏర్పాట్లపై మంగళవారం ప్రత్యేకంగా సన్నాహక సభ నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్టు అధ్యక్షుడు ఏవీఎం నాగరాజ్ అధ్యక్షత వహించారు. ట్రస్టు గౌరవకార్యదర్శి రుద్రమూర్తి మాట్లాడుతూ మే 21న ఉత్సవాలు ప్రారంభమై 28న మంగళవారం దీపహారతి, జాతర ఉంటాయన్నారు. మే 21 నుంచి 28వరకు ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో గంగామతస్థ సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సన్నాహకసభలో ట్రస్టు సభ్యులు

భక్తిశ్రద్ధలతో గంగాదేవి దీపోత్సవం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 16: తాలూకాలోని మేలూరులో చారిత్రాత్మక నేపథ్యం కల్గిన గంగాదేవి దీపోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. మహిళలు భక్తితో దీపాలను నెత్తిన మోస్తూ ఊరేగించారు. ఇందుకు సంప్రదాయంగా ఉపవాసదీక్ష ఆచరించడం ప్రత్యేకత. ఏటా నిర్వహిస్తున్న గంగాదేవి జాతర ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలవారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఎటు చూసినా జాతర వాతావరణం నెలకొంది.





గంగాదేవికి అలంకరణ, దీపోత్సవంలో భక్తులు

ఆర్‌సీబీ జట్టును విక్రయించండి

» టెన్నిస్ క్రీడాకారుడు మహేష్‌భూపతి అసంతృప్తి

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ జట్లలో అత్యంత ప్రజాదరణ కలిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)ను ఇతరులకు విక్రయించేయాలని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు మహేష్ భూపతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌సీబీ జట్టు ఓడిపోవడంతో అభిమానులలో తీవ్ర నిరాశ నెలకొంది. స్టేడియంలోను అభిమానులు హంగామా చేశారు. అదే తరహాలోనే మహేష్ భూపతి ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. దయచేసి జట్టును కొత్త ఫ్రాంఛైజీలకు విక్రయించాలన్నారు. క్రీడలు, ఐపీఎల్, అభిమానులు, ఆటగాళ్ళ కోసం బీసీసీఐ ఇతర జట్లను విక్రయించిన రీతిలోనే కొత్త ఫ్రాంఛైజీలకు ఆర్‌సీబీ జట్టును విక్రయించాలని భావిస్తున్నట్లు ట్వీట్ చేశారు. గత 16 సీజన్‌ల ఐపీఎల్ పోటీలలో విజేతగా ఆర్‌సీబీ నిలువకపోయినా ఇంత ఘోరంగా ఆడలేదనే అభిప్రాయాలు అభి మానులలో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఏడు మ్యాచ్‌లకు గాను కేవలం ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలుపు సాధించారు. సొంతగడ్డపైనే ఆర్‌సీబీ అత్యధిక మ్యాచ్‌లు ఓడిపోవడం అభిమానులకు జీర్ణించుకోలేనంతగా ఆగ్రహం కలిగిస్తోంది.

కుమార వ్యాఖ్యలపై కొనసాగుతున్న నిరసనలు



చింతామణిలో మహిళా కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో నిరసన

చింతామణి, ఏప్రిల్ 16: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలతో మహిళలు దారి తప్పుతున్నారనే మాజీ సీఎం కుమారస్వామి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనలు కొనసగుతున్నాయి. కాంగ్రెస్ పిలుపు మేరకు చింతామణి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. తాలూకా పంచాయతీ సమీపాన చేరిన కార్యకర్తలు అక్కడనుంచి బెంగళూరు రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఎంసీ ఆంజనేయరెడ్డి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి కుమారస్వామికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నగరసభ మాజీ అధ్యక్షురాలు, ప్రస్తుత సభ్యురాలు రేఖా ఉమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ గ్యారెంటీలతో మహిళలు ఎక్కడ దారి తప్పారో రుజువు చూపాలని డిమాండ్ చేశారు. మహిళలపట్ల అనుచితంగా వ్యాఖ్యానించడం ఆపై క్షమాపణలు చెప్పడం జేడీఎస్, బీజేపీ నాయకులు అలవాటుగా మారిందని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇలాంటివారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిరసనలో మహబూబ్‌జాన్, నగరసభ మాజీ సభ్యులు రాధమ్మ, శైలజా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నగలు స్వాధీనం : ఇద్దరి అరెస్టు



నగలను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన జీవనం కోసం చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రామమూర్తినగర్ పోలీసులు అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చోరీలకు సంబంధించి రౌడీ శ్రీనివాస్, అతడి సహచరుడు వెంకటేశ్‌ను అరెస్టు చేశారన్నారు. నిందితులనుంచి 205 గ్రాముల నగలు, సుజుకి యాక్సెస్ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంటూ వీటి విలువ సుమారు రూ.15లక్షలుగా అంచనా వేశామన్నారు. మదకరి నాయక రోడ్డులోని ఇంట్లో చోరీకి సంబంధించి రామమూర్తినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు ఛేదించారన్నారు. క్లూస్ టీమ్ సేకరించిన సమాచారం మేరకు దావణగెరెలో ఇద్దరు నిందితులను విచారించగా యశ్వంతపుర రౌడీషీటర్ శ్రీనివాస్‌గా తేలిందన్నారు. ఇతడిపై 20కుపైగా దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. ఇతడి సహచరుడు వెంకటేశ్‌ను కూడా అరెస్టు చేశారన్నారు. చోరీకి ఉపయోగించిన ద్విచక్రవాహనం కూడా స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరి అరెస్టుతో రామమూర్తి నగర్ పోలీస్ స్టేషన్‌లో 1, కేఆర్ పురం పోలీస్ స్టేషన్ 3 కేసులు కొలిక్కి వచ్చాయన్నారు. కార్యాచరణలో ఇన్‌స్పెక్టర్ ముత్తురాజు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.